సాక్షి
విశాఖపట్నం
బుధవారం । 30 । జూలై । 2025



నిబంధనలు అతిక్రమిస్తే సీజ్ చేస్తాం 8లో



ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం 8లో




'అతిథి' ఎంపికలో అయోమయం 8లో

జనసేనలో ముసలం

జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ భీశెట్టి వసంతలక్ష్మిపై వేటుకు ప్లాన్

ఎమ్మెల్సీ నాగబాబు సమావేశంలో ఆమె భర్త ప్రశ్నించారనే అక్కసుతోనే..

- కూటమిలో జనసేన నేతలకు విలువ లేదని చెప్పడమే ఆయన చేసిన తప్పిదం
- సమావేశంలోనే భీశెట్టి గోపీకృష్ణపై నాగబాబు ఆగ్రహం
- మైక్ లాక్కొని బయటకు గెంటేసిన జనసేన నేతలు
- తాజాగా ఫ్లోర్‌లీడర్‌ను మార్చాలని ఎమ్మెల్యే వంశీకృష్ణకు కార్పొరేటర్ల లేఖ
- పథకం ప్రకారమే చేస్తున్నారని పార్టీ శ్రేణుల్లో టాక్



విశాఖ సిటీ: జనసేన పార్టీలో ముసలం రాజుకుంది. ఆ పార్టీ జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ భీశెట్టి వసంతలక్ష్మిపై వేటుకు రంగం సిద్ధమవుతోంది. కూటమిలో జనసేనకు విలువ లేదన్న వాస్తవాన్ని ఆమె భర్త చెప్పిన పాపానికి జనసేన పెద్దలు వారిపై కక్ష కట్టేశారు. బీసీ మహిళా నేతను పదవి నుంచి పక్కన పెట్టాలన్న నిర్ణయానికి వచ్చారు. కూటమిలో జనసేన ప్రాధాన్యత కోసం పార్టీ నేతలు, కార్యకర్తలు పట్టుబడుతుంటే.. దాన్ని పార్టీ ధిక్కార స్వరంగా అధినాయకులు పరిగణిస్తుండడం శ్రేణులను షాక్‌కు గురి చేస్తోంది. పార్టీ నేతల ఆత్మాభిమానాన్ని దెబ్బతీసేలా నిర్ణయాలు తీసుకుంటుండడం తీవ్ర చర్చకు దారిస్తోంది.

ప్రాధాన్యత లేదన్న పాపానికి..

కూటమి ప్రభుత్వంలో జనసేన నేతలకు, కార్యకర్తలకు విలువ లేకుండా పోయింది. సాక్షాత్తు జనసేన ఎమ్మెల్యేలు సైతం నియోజకవర్గాల్లో పనులు జరగడం లేదని అసంతృప్తి వ్యక్తం చేసిన సందర్భాలు అనేకమున్నాయి. పోలీస్‌స్టేషన్‌లో సిఫార్సు చేసిన వారికి పోస్టింగ్‌లు ఇవ్వలేదన్న కోపంతో పెందుర్తి జనసేన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు గన్‌మెన్లను సరెండ్ చేసిన అంశం అప్పట్లో హాట్ టాపిక్‌గా నిలిచింది. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఇప్పటికీ నియోజకవర్గంలో టీడీపీ ఇన్‌చార్జ్ సీతంరాజు సుధాకర్ పెత్తనానికి చెక్ పెట్టేందుకు కిందా మీదా పడుతూనే ఉన్నారు. ఎమ్మెల్యేల పరిస్థితే ఇలా ఉంటే.. ఇక పార్టీ నేతలు, ద్వితీయ స్థాయి నాయకులు పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. ఏ ప్రభుత్వ కార్యాలయంలోని చిన్న పని కూడా జరగని పరిస్థితి నెలకొంది. కూటమిలో ఆత్మగౌరవం కోసం జనసేన నేతలు గత ఏడాది కాలంగా పట్టుబడుతూనే ఉన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే అనేక సార్లు పార్టీ అధినాయకుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయింది. తాజాగా సీతంపేట ప్రాంతంలోని పార్టీ కార్యాలయంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ సోదరుడు, ఎమ్మెల్సీ నాగబాబు సమక్షంలో సమావేశం నిర్వహించారు. దీనికి జనసేన కార్పొరేటర్లతో పాటు నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. ఇందులో జిల్లాలో నెలకొన్న పరిస్థితులపై కొందరు నేతలు గోడు చెప్పుకున్న పాపానికి నాగబాబు ఒంటి కాలిపై లేచారు. కూటమిలో తమకు విలువ ఇవ్వడం లేదని, తమ అభిప్రాయాలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసిన వారిపై వేటు వేయాలన్న నిర్ణయానికి వచ్చారు. ఎన్ని సమస్యలు వచ్చినా కూటమిలో సర్దుకొని పనిచేయాల్సిందే అని నాగబాబు తెగేసి చెప్పడంతో జనసేన నాయకులు, కార్యకర్తలు ఖంగుతిన్నారు.

చేతికి మట్టి అంటకుండా..

నాగబాబు సమావేశంలో జీవీఎంసీ జనసేన ఫ్లోర్ లీడర్ భీశెట్టి వసంతలక్ష్మి భర్త భీశెట్టి గోపీకృష్ణ పార్టీ పరిస్థితిపై మాట్లాడారు. కూటమిలో జనసేన పార్టీ నేతల అభిప్రాయాలకు విలువ ఇవ్వడం లేదని మాత్రమే చెప్పారు. ఇంతలో ఎమ్మెల్సీ నాగబాబు కల్పించుకుని గోపీకృష్ణపై ఫైర్ అయ్యారు. సమావేశం నుంచి వెళ్లిపోవాలని హుకుం జారీ చేశారు. వెంటనే అక్కడి నేతలు గోపీకృష్ణ చేతిలో ఉన్న మైక్ లాక్కున్నారు. అక్కడి నుంచి పంపించేశారు. దీంతో ఫ్లోర్‌లీడర్ భర్త అవమాన భారంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. కూటమిలో జనసేన ప్రాధాన్యత కోసం మాట్లాడుతుంటే.. దానికి మద్దతుగా నిలవాల్సిన పార్టీ పెద్దలు.. వారిపైనే ఆగ్రహం వ్యక్తం చేయడంతో అక్కడున్న వారంతా విస్తుపోయారు. ఇదిలా ఉంటే.. వెంటనే ఫ్లోర్‌లీడర్ భీశెట్టి వసంతలక్ష్మిని ఆ పదవి నుంచి తప్పించేందుకు ఏర్పాట్లు జరిగిపోతుండడం గమనార్హం. నాగబాబు సమావేశంలో ఆమె భర్త మాట్లాడడాన్ని పార్టీ పెద్దలు తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో పార్టీ పెద్దల చేతికి మట్టి అంటకుండా తెలివిగా కార్పొరేటర్లను ముందు పెట్టి కథను నడిపిస్తున్నారు. దీనిపై పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు లేఖ అందజేయడం ఇప్పుడు జనసేనలో హాట్ టాపిక్‌గా మారింది.

ఫ్లోర్ లీడర్‌పై ఆరోపణలతో లేఖ

పార్టీ పెద్దల స్కెచ్ ప్రకారం జనసేన కార్పొరేటర్లు ఎమ్మెల్యే వంశీకృష్ణకు లేఖ అందజేశారు. ఇందులో ఫ్లోర్‌లీడర్ భీశెట్టి వసంతలక్ష్మిని మార్చాలని పేర్కొన్నారు. ఆమె స్వప్రయోజనాలు, వారి సమస్యల పరిష్కారం కోసమే దృష్టి పెట్టారని ఆరోపించారు. మిగిలిన జనసేన కార్పొరేటర్లను నిర్లక్ష్యం చేశారని తెలిపారు. అలాగే ఆమెకు ఫ్లోర్‌లీడర్‌కు అవసరమైన అనుభవం, నాయకత్వ లక్షణాలు లేవని విమర్శించారు. ఈ పదవికి అనుభవజ్ఞుడైన వ్యక్తి అవసరమన్నారు. ఈ క్రమంలో ప్రస్తుతం జీవీఎంసీలో జనసేనకు చెందిన 11 మందిలో ఒకరిని ఫ్లోర్ లీడర్‌గా నియమించాలని కోరారు. ఈ లేఖ వెనుక జనసేన పెద్దలు ఉన్నట్లు పార్టీ నేతలే గుసగుసలాడుకుంటున్నారు. అతడు పార్టీ నేతల తరఫున మాట్లాడిన పాపానికి వసంతలక్ష్మిపై వేటుకు రంగం సిద్ధం చేయడాన్ని తప్పుబడుతున్నారు. పార్టీ ఉనికి కోసం నేతలు పోరాటం చేస్తుంటే.. వారిపైనే వేటు వేస్తుండడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు.

జనసేన ఫ్లోర్‌లీడర్‌గా ఉషశ్రీ?

ప్రస్తుత ఫ్లోర్‌లీడర్ భీశెట్టి వసంతలక్ష్మిని ఆ పదవి నుంచి తప్పించడం ఖాయంగా కనిపిస్తోంది. ఆ స్థానంలో 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ పేరును పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. వైఎస్సార్ సీపీ నుంచి గెలిచిన ఆమె కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత జనసేనలోకి జంప్ అయ్యారు. డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ పదవిని ఆశించి భంగపడ్డారు. కనీసం స్టాండింగ్ కమిటీలో అయినా ఛాన్స్ వస్తుందని ఆశపడ్డారు. అందులో జనసేనకు ప్రాతినిధ్యమే లేకపోవడంతో ఇప్పుడు ఫ్లోర్‌లీడర్‌పై కన్నేశారు. జనసేన పార్టీ పెద్దలు కూడా ఉషశ్రీ వైపే మొగ్గు చూపినట్లు సమాచారం. త్వరలోనే ఇందుకు సంబంధించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

స్టాండింగ్ కమిటీలోనూ జనసేనకు నో చాన్స్

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల అంశం జనసేనలో అగ్గి రాజేస్తోంది. స్థాయీ సంఘంలో కూడా జనసేనకు ప్రాతినిధ్యం లేకుండా పోయింది. ఇందులో 10 స్థానాలు ఉండగా.. 9 టీడీపీ, ఒకటి బీజేపీ సర్దేసుకున్నాయి. జనసేనకు ఒక్క స్థానాన్ని కూడా కేటాయించకపోవడం గమనార్హం. ఇదిలా ఉంటే.. కొద్ది రోజుల క్రితం స్టాండింగ్ కమిటీ ఎన్నికలపై జనసేన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సమావేశం నిర్వహించి జనసేనకు మూడు స్థానాలను కేటాయిస్తున్నట్లు చెప్పారు. వీటిలో ఒకటి పెద్దిశెట్టి ఉషశ్రీ, మరొకటి మహమ్మద్ సాధిక్, మరొకరికి అవకాశం దక్కే ఛాన్స్ ఉందని ఆశ పెట్టారు. దీంతో ఆ కార్పొరేటర్లు ఊహల్లో తేలారు. చివరికి జనసేనకు ఒక్క స్థానాన్ని కూడా కేటాయించకపోవడంతో అందరూ నోరెళ్లబెట్టారు. అయితే 11వ సభ్యుడిగా సాధిక్ నామినేషన్ దాఖలు చేశారు. 10 మందిలో ఎవరైనా విత్‌డ్రా అయితేనే సాధిక్‌కు అవకాశం ఉంటుంది. లేకుంటే స్టాండింగ్ కమిటీలో జనసేనకు ప్రాతినిధ్యం లేకుండా పోతుంది.

ముగిసిన నామినేషన్ల ఘట్టం

స్థాయీ సంఘం ఎన్నికల్లో మొత్తం 21 నామినేషన్లు



డాబాగార్డెన్స్: జీవీఎంసీ **స్థాయీ సంఘం ఎన్నిక** నామినేషన్ల ఘట్టం మం**గళవారంతో ముగిసింది.** వైఎస్సార్ సీపీ నుంచి **10 మంది, కూటమిలోని** టీడీపీ నుంచి 9 మంది, **బీజేపీ నుంచి ఒకరు,** జనసేన నుంచి ఒకరు నా**మినేషన్లు దాఖలు చేశారు.** బుధవారం ఉదయం 11 **గంటల నుంచి నామినేష**న్లను పరిశీలిస్తారు. ఆగస్టు 2 మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారు. 6వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణ, ఓట్ల లెక్కింపు, అనంతరం ఫలితాలు వెల్లడిస్తారు.

- వైఎస్సార్ సీపీ నుంచి నిక్క లక్ష్మి(20వ వార్డు), సాడి పద్మారెడ్డి(24వ వార్డు), పల్లా అప్పలకొండ(28వ వార్డు), బిపిన్ కుమార్ జైన్(31వ వార్డు), గుండాపు నాగేశ్వరరావు(40వ వార్డు), కోడిగుడ్ల పూర్ణిమ(41వ వార్డు), రెయ్యి వెంకటరమణ(51వ వార్డు), కేవీఎస్ శశికళ(55వ వార్డు), మహ్మద్ ఇమ్రాన్(66వ వార్డు), ఉరుకూటి రామచంద్రరావు(70వ వార్డు) నామినేషన్లు దాఖలు చేశారు.
- టీడీపీ నుంచి మొల్లి హేమలత(5వ వార్డు), సేనాపతి వసంత(96వ వార్డు), రాపర్తి త్రివేణి వరప్రసాదరావు(92వ వార్డు), దాడి వెంకట రామేశ్వరరావు(88వ వార్డు) రమేష్, రౌతు శ్రీనివాస్(78వ వార్డు), మొల్లి ముత్యాలు(87వ వార్డు) మాదంశెట్టి చిన్నతల్లి(83వ వార్డు), వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలో చేరిన కొణతాల నీలిమ(79వ వార్డు), గేదెల లావణ్య(17వ వార్డు)లకు కూటమి అవకాశం కల్పించింది. అలాగే బీజేపీ కార్పొరేటర్ గంకల కవిత(47వ వార్డు) నామినేషన్ దాఖలు చేశారు. జనసేనలో చేరిన స్వతంత్ర కార్పొరేటర్ మహ్మద్ సాధిక్(39వ వార్డు) 11వ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయడం గమనార్హం.

'స్థాయీ'కి రూ.5 లక్షలు..!

- స్టాండింగ్ కమిటీ ఎన్నికల బరిలో ఉన్న సభ్యుల నుంచి వసూలు
- కీలక నేత చేతికి 10 మంది నుంచి రూ.50 లక్షలు
- ఎన్నికకు ముందు సభ్యులకు పంచేందుకు ఈ డబ్బు?



విశాఖ సిటీ: జీవీఎంసీ 'స్థాయీ' రేటు ఫిక్స్ అయింది. ఎన్నికల్లో సభ్యులకు పంపకాలకు 'ప్రత్యేక' నిధులను పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. ఇందు కోసం స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో సీటు కొట్టిన వారి నుంచి రూ.5 లక్షల చొప్పున రూ. 50 లక్షలు వసూలు చేశారన్న టాక్ చక్కర్లు కొడుతోంది. జీవీఎంసీలో ఒక కీలక నేత రంగంలోకి దిగి స్వయంగా ఒక్కో సభ్యుడి నుంచి వసూలు చేశారన్న గుసగుసలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఎన్నికకు ముందు రోజు ఒక్కో సభ్యుడికి ఈ నిధుల నుంచే పంపకాలు చేపట్టాలన్న ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. జీవీఎంసీలో స్థాయీ సంఘం ఎన్నికల ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఇప్పటికే సభ్యులు నామినేషన్లు దాఖలు చేశారు. టీడీపీ నుంచి 9 మంది, బీజేపీ నుంచి ఒకరు నామినేషన్ వేశారు. 11వ సభ్యుడిగా జనసేన కార్పొరేటర్ మహమ్మద్ సాధిక్ తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. అయితే అతడికి అవకాశం లేనట్లు తెలుస్తోంది. మంగళవారంతో నామినేషన్ల స్వీకరణ గడువు ముగిసింది. ఆగస్టు 2వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకావం ఉంది. ఆగస్టు 6వ తేదీన స్థాయీ సంఘం ఎన్నికలు జరగనున్నాయి. స్థాయీ సంఘం సభ్యులుగా నామినేషన్లు వేసిన వారి నుంచి డబ్బు వసూలు అంశం ఇప్పుడు జీవీఎంసీలో చర్చనీయాంశంగా మారింది. ఎన్నిక ముందు కార్పొరేటర్లకు కొంత మొత్తాన్ని ముట్టజెప్పి టీడీపీ, బీజేపీ అభ్యర్థుల విజయానికి అవసరమైన ఓట్లు సాధించే పనిలో నిమగ్నమయ్యారు.

నగరాన్ని గాలికొదిలేశారు..!

- దేశంలోనే కాలుష్యం పెరిగిన నగరాల్లో రెండో స్థానంలో వైజాగ్
- 2024-25లో నగరంలో 32.9 శాతం పెరిగిన వాయు కాలుష్య స్థాయిలు
- గత పదేళ్లలో కాలుష్య నియంత్రణకు రూ.129.4 కోట్లు మంజూరు చేసిన కేంద్రం
- ఇప్పటివరకు రూ.39 కోట్లు మాత్రమే ఖర్చు చేసిన రాష్ట్రం
- వైఎస్సార్ సీపీ హయాంలో కాలుష్య నియంత్రణకు అధిక మొత్తం వినియోగం
- కూటమి అధికారంలోకి వచ్చాక మహా నగరంపై నిర్లక్ష్యం



నగరంలో వాయు కాలుష్యం

సాక్షి, విశాఖపట్నం: మనిషి మనుగడకు స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన నీరు, ఆరోగ్యకరమైన ఆహారం అత్యవసరం. వీటిలో ఏది లోపించినా అభివృద్ధికి ఆటంకం కలుగుతుంది. దేశ రాజధాని ఢిల్లీలో ప్రస్తుతం ఇదే పరిస్థితి. మరి మన మహానగరం విశాఖపట్నం సురక్షితమేనా అంటే, కాదనే సమాధానం వినబడుతోంది. విశాఖలో కాలుష్యం గణనీయంగా పెరిగి, ప్రాణ వాయువు కొరవడుతోంది. కేంద్ర ప్రభుత్వ నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (ఎన్‌సీఏపీ)లో భాగంగా.. దేశవ్యాప్తంగా 130 నగరాల్లో కాలుష్య స్థాయిలు ఎలా పెరుగుతున్నాయనే అంశంపై అధ్యయనం చేసింది. 2024–25లో సంపూర్ణ డేటాని సేకరించి.. నివేదిక విడుదల చేసింది. మొత్తం 130 నగరాల్లో అత్యంత ఎక్కువగా కాలుష్యం పెరిగిన జాబితాలో ఔరంగాబాద్ మొదటి స్థానంలో ఉండగా.. విశాఖ రెండో స్థానంలో ఉంది. కాలుష్యం పెరిగిన నగరాల జాబితాలో విశాఖ రెండో స్థానానికి చేరడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా, నగర కాలుష్యంపై ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోకపోవడమే ఈ దుస్థితికి కారణమని ప్రస్తుత గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

2024–25 నుంచి 32.9 శాతం పెరుగుదల

దేశంలో వాయు కాలుష్యం పెరిగిన నగరాల్లో విశాఖపట్నం రెండో స్థానంలో నిలిచిందని జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమం (ఎన్‌సీఏపీ) అధ్యయనం వెల్లడించింది. 2019లో ప్రారంభించిన ఈ కార్యక్రమం, 2017–18 నాటి పీఎం 10 స్థాయిలను ప్రామాణికంగా తీసుకుని అంచనా వేసింది. ఎన్‌సీఏపీ గణాంకాల ప్రకారం, 2024–25లో విశాఖ నగరంలో కాలుష్యం 32.9 శాతం పెరిగింది. ఇది గతంలో ఎన్నడూ లేనంత దారుణమని నివేదిక పేర్కొంది. పీఎం 10 సాంద్రత 101 మైక్రోగ్రామ్స్‌పర్ క్యూబిక్ మీటర్‌కు చేరడం ఆందోళన కలిగించే అంశంగా హెచ్చరించింది. మొదటి స్థానంలో ఉన్న ఔరంగాబాద్‌లో 33.3 శాతం గాలి నాణ్యత క్షీణించింది. విశాఖతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం, విజయనగరం సహా 13 నగరాల్లో వాయు కాలుష్యం గణనీయంగా పెరిగినట్లు ఈ అధ్యయనం తేల్చింది.

కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే..

2019లో ప్రారంభమైన కాలుష్య నియంత్రణ ప్రాజెక్టులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ, విజయవాడ, కర్నూలు, కడప, అనంతపురం సహా 13 నగరాలను ఎంపిక చేశారు. ఈ నగరాల్లో గాలిలో దుమ్ము, వాహన ఉద్గారాలు, పారిశ్రామిక కాలుష్యం నియంత్రణపై దృష్టి సారించాలని సూచించారు. విశాఖ నగరానికి ఇప్పటి వరకూ రూ.129.4 కోట్లు కేటాయించారు. ఇందులో గత వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్న సమయంలో విడుదలైన రూ.39.6 కోట్లు ఖర్చు చేసి.. కాలుష్యాన్ని నియంత్రించేందుకు తీవ్రంగా శ్రమించింది. విశాఖలో ఏప్రిల్ 2017 నుంచి మార్చి 2018 వరకూ పీఎం10 స్థాయిలు 159 నమోదు కాగా.. 2019 డిసెంబర్‌కి ఈ సంఖ్య 108కి చేరింది. 2020 జనవరి నుంచి సెప్టెంబర్ వరకూ 96కి తగ్గింది. 2021 నాటికి మరింత కాలుష్యం తగ్గి 90కి చేరుకుంది. కానీ కూటమి ప్రభుత్వంలో మాత్రం కాలుష్యం అమాంతం పెరిగిపోయింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ నిధుల గురించి పట్టించుకోకుండా నగరంపై నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది.

గతేడాది సెప్టెంబర్‌లో మరింత దారుణంగా...

2024–25 దేశవ్యాప్త అధ్యయనం ప్రకారం విశాఖలో వాయు నాణ్యత మరింత క్షీణించింది. ముఖ్యంగా గత ఏడాది సెప్టెంబర్‌లో పీఎం 2.5 సాంద్రత స్థాయిలు దారుణంగా నమోదయ్యాయి. దేశంలోని టాప్–10 అత్యంత కాలుష్య నగరాల రోజువారీ జాబితాలో విశాఖ పదిసార్లు చోటు దక్కించుకోవడం ఆందోళన కలిగిస్తోంది. పోర్టు నుంచి ఎన్టీపీసీ, ఫార్మాసిటీ వరకు అన్నింటి నుంచి కాలుష్యం నగరంలో విస్తరిస్తోంది. వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ శాతం రోజురోజుకూ పెరుగుతోంది. కూటమి ప్రభుత్వం తక్షణమే కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టకపోతే గాలి నాణ్యత మరింత దిగజారి, ఢిల్లీ లాంటి దుర్భర పరిస్థితులు విశాఖలో కూడా తలెత్తుతాయని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

నగరంలో పీఎం 10 స్థాయిలు

సంవత్సరం	పీఎం10
2018 ఏప్రిల్	159
2019 డిసెంబర్	108
2020 సెప్టెంబర్	96
2021 డిసెంబర్	90
2024 సెప్టెంబర్	101

(మైక్రోగ్రామ్స్ పర్ క్యూబిక్‌మీటర్)

5జీ అమలుకు స్టార్టప్‌ల సహకారం అవసరం

అల్లిపురం: బీఎస్ఎన్ఎల్ త్వరలో 5జీ నెట్‌వర్క్‌ను మరింత మెరుగుపరచనుందని.. నెట్‌వర్క్ ఆటోమేషన్ అప్లికేషన్ అమలుకు పరిశ్రమలు, స్టార్టప్ కంపెనీలు సహకరించాలని బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ పాల్ విలియమ్ కోరారు. మంగళవారం డాబాగార్డెన్స్‌లోని బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయంలో స్టార్టప్ కంపెనీలు, పరిశ్రమల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వినియోగదారుల సంతృప్తి కోసం వైవిధ్యభరితమైన రీతిలో బీఎస్ఎన్ఎల్‌తో కలిసి పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా స్టార్టప్‌లు, ఇంక్యుబేటర్లతో 8 ఒప్పందాలు కుదుర్చుకున్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ ఆపరేషన్స్ జి.ఆడమ్, డాక్టర్ ఎం.సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో మ్యుటేషన్‌తో అందరికీ మేలు

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ బాలకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న డీఐజీ బాలకృష్ణ

మధురవాడ: రిజిస్ట్రేషన్ వ్యవస్థలో ప్రభుత్వం తీసుకువస్తున్న అర్బన్ ఆటో మ్యుటేషన్ పద్ధతి అందరికీ ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ బాలకృష్ణ అన్నారు. మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన 'అర్బన్ ఆటో మ్యుటేషన్' అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డాక్యుమెంట్ రైటర్ పబ్లిక్ డేటా ఎంట్రీలో తీసుకోవల్సిన జాగ్రత్తలు, దీనివల్ల కక్షిదారులకు కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. అక్రమ రిజిస్ట్రేషన్లు అరికట్టేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలోకి తీసువచ్చినట్టు చెప్పారు. ప్రజలు తమ భూమి వివరాలను registration.ap.gov.in ద్వారా స్వయంగా తెలుసుకోవచ్చన్నారు. సబ్ రిజిస్ట్రార్ చక్రపాణి మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో ఆస్తిని కొనుగోలు చేసిన తర్వాత కక్షిదారుడు మ్యుటేషన్ కోసం జీవీఎంసీ చుట్టూ తిరిగే పని ఇక ఉండదని, ప్రాపర్టీ ట్యాక్స్, వాటర్ ట్యాక్స్ అన్నింటిలోనూ పేరు ఆటోమెటిక్‌గా మారిపోతుందని చెప్పారు. కార్యక్రమంలో పలువురు డాక్యుమెంట్ రైటర్లు, కక్షిదారులు పాల్గొన్నారు.

గైస్‌కు ఎన్‌బీఏ గుర్తింపు

మురళీనగర్: కంచరపాలెంలోని కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్)కు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు లభించింది. ఈ కాలేజీలో కెమికల్ ఇంజినీరింగ్, ఆయిల్ టెక్నాలజీ, పెట్రోకెమికల్ ఇంజినీరింగ్, ప్లాస్టిక్ అండ్ పాలిమర్స్ కోర్సులు ఉన్నాయి. వీటిలో కెమికల్ ఇంజినీరింగ్, ఆయిల్ టెక్నాలజీ, పెట్రోకెమికల్ ఇంజినీరింగ్ విభాగాలకు గతంలోనే ఎన్‌బీఏ గుర్తింపు లభించింది. తాజాగా ప్లాస్టిక్ అండ్ పాలిమర్స్ కోర్సుకు ఎన్‌బీఏ గుర్తింపుకోసం దరఖాస్తు చేయగా ఇటీవల ఎన్‌బీఏ బృంద సభ్యులు కాలేజీని సందర్శించి, మౌలిక సదుపాయాలు, ప్రయోగశాలలు, వర్క్‌షాపులు, సిబ్బంది తదితర వివరాలను పరిశీలించారు. బృంద సభ్యులు సమర్పించిన నివేదిక మేరకు ప్లాస్టిక్స్ అండ్ పాలిమర్స్ విభాగానికి ఎన్‌బీఏ గుర్తింపు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 2025–26 నుంచి 2027–28 వరకు మూడేళ్ల పాటు ఈ గుర్తింపు అమలులో ఉంటుంది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ సమావేశం నిర్వహించి, వివరాలను వెల్లడించారు. ఎన్‌బీఏ గుర్తింపును నిలబెట్టుకునేలా సిబ్బంది పని చేయాలని కోరారు.

గంజాయి కేసులో ఐదుగురి అరెస్ట్

అల్లిపురం: గంజాయి రవాణా కేసులో ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు తెలిపారు. గత ఏడాది డిసెంబర్‌లో 192 కేజీల గంజాయిని టూటౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు.. ఈ వ్యవహారంలో బిహార్‌కు చెందిన ఒక ముఠా ఉన్నట్లు గుర్తించారు. ప్రత్యేక బృందాలు బిహార్ వెళ్లి.. బిహార్, పాట్నా, భక్తయిపూర్‌కు చెందిన తున్న కుమార్, పవన్‌కుమార్, శ్రావణ్‌కుమార్, అజయ్‌కుమార్, పంచానంద్ రేలను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేయాల్సి ఉందని సీఐ తెలిపారు.

అతిథి ఎంపికలో అయోమయం

- ఏయూలో అతిథి అధ్యాపకుల భర్తీ
- రూల్ ఆఫ్ రిజర్వేషన్ లేకుండా నోటిఫికేషన్
- ఆగస్టు 1 నుంచి ఇంటర్వ్యూల నిర్వహణకు సన్నద్ధం
- తరగతులు జరగక విద్యార్థుల ఆందోళన



మద్దిలపాలెం: వందేళ్ల ఘన చరిత్ర కలిగిన ఆంధ్రా యూనివర్సిటీలో అతిథి అధ్యాపకుల నియామక ప్రక్రియ గందరగోళంగా మారింది. అధికారుల సమన్వయ లోపం, అనాలోచిత నిర్ణయాలతో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకుండా నోటిఫికేషన్ విడుదల చేయడం, ఇంటర్వ్యూల నిర్వహణలో జరుగుతున్న పరిణామాలు.. అభ్యర్థులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. దీని వల్ల విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా.. తరగతులు జరగక విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది.

నోటిఫికేషన్‌పై విమర్శలు

ఏయూ అధికారులు అతిథి అధ్యాపకుల నియామకాలకు సంబంధించి రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను విస్మరించి వెబ్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఏఏ విభాగంలో ఎన్ని పోస్టులున్నాయి? వాటిలో ఏయే రిజర్వేషన్లకు ఎన్ని కేటాయించారన్న వివరాలను పొందుపరచలేదు. ఇది నియమావళికి విరుద్ధమని, ప్రస్తుతం ఏయూలో అతిథి అధ్యాపకులుగా పని చేస్తున్న సుమారు 400 మంది భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై కొందరు అభ్యర్థులు ఉన్నత విద్యామండలికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

1,100 దరఖాస్తుల స్వీకరణ

ఆదరాబాదరగా విడుదల చేసిన ఈ వెబ్ నోటిఫికేషన్‌కు గడువు ముగిసే నాటికి సుమారు 1,100 దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. ఇప్పటికే ఏయూలో పనిచేస్తున్న వారితో పాటు కొత్త అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకున్నారు. సగటున ప్రతి డిపార్ట్‌మెంట్‌కు కనీసం 10 దరఖాస్తులు అందినట్లు తెలుస్తోంది. అయితే ఇంజనీరింగ్ కళాశాలలకు చాలా తక్కువ దరఖాస్తులు రాగా.. కొన్ని విభాగాలకు అసలు దరఖాస్తులే రాలేదని సమాచారం. ఆరు నెలల (సెమిస్టర్) కాలానికి రూ.45,000 వేతనంగా చెల్లిస్తుండటంతో చాలా మంది దరఖాస్తు చేసుకోవడానికి ఆసక్తి చూపలేదని తెలుస్తోంది.

వందేళ్ల చరిత్రలో..

ఆంధ్ర యూనివర్సిటీలో కొత్త విద్యా సంవత్సరం జూలై ఒకటో తేదీ నుంచి ప్రారంభమైంది. దాదాపు నెల రోజులు కావస్తున్నా.. టైం టేబుల్ విడుదల కాలేదు. అధ్యాపకులు తరగతులకు వెళ్లడం లేదు. అతిథి అధ్యాపకుల నియామక ప్రక్రియ జాప్యం, ఒప్పంద అధ్యాపకులు అగ్రిమెంట్ పేరుతో తరగతులకు వెళ్లకపోవడం వల్ల ఈ పరిస్థితి నెలకొంది. వందేళ్ల చరిత్ర కలిగిన ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నెల రోజులుగా తరగతులు నిర్వహించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మొదటి సెమిస్టర్ సమయం ఆసన్నమవుతుండటంతో విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

అందుకేనా.. వేర్వేరు ప్రాంతాల్లో..?

ఆగస్టు 1 నుంచి 4వ తేదీ వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ప్రకటించినప్పటికీ, వాటి నిర్వహణపై పూర్తి గందరగోళం నెలకొంది. గతంలో ప్రిన్సిపాల్ కార్యాలయంలోనే అతిథి అధ్యాపకుల ఇంటర్వ్యూలు నిర్వహించేవారు. కానీ ఈ సారి వేర్వేరు ప్రాంగణాల్లో ఇంటర్వ్యూలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేయడం ఆశ్చర్యం కలిగిస్తోంది. మొదట ప్రిన్సిపాల్ కార్యాలయం, తర్వాత రిజిస్ట్రార్ కార్యాలయం అని ప్రచారం జరిగింది. అభ్యర్థులంతా ఒకే చోట చేరితే సమస్యలు తలెత్తవచ్చనే ఉద్దేశంతో వేర్వేరు ప్రాంతాల్లో ఇంటర్వ్యూలు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.

రోజుకో మాట

ఏయూ ఆర్ట్స్ కళాశాలలకు సంబంధించి విజయనగరం ప్యాలెస్, అంబేడ్కర్ ఆడిటోరియం, ఇంజనీరింగ్ కళాశాలకు సంబంధించి జియోఫిజిక్స్, సైన్స్, లా, ఫార్మసీ కళాశాలలకు సంబంధించి అంబేడ్కర్ ఆడిటోరియంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు అభ్యర్థులకు ఈ మెయిల్ ద్వారా సమాచారం ఇచ్చారు. అయితే ఎంపిక కమిటీ కూర్పుపై అధికారులు రోజుకో సమాచారం ఇస్తున్నారు. గతంలో వీసీ ఆధ్వర్యంలో సిక్స్ మెన్ కమిటీ ఇంటర్వ్యూలు నిర్వహించింది. ప్రస్తుతం ప్రిన్సిపాల్ చైర్మన్‌గా, హెచ్‌వోడీలు, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్, ఎక్స్‌టర్నల్ సభ్యులుగా ఉంటారని ఒకసారి, ఫ్యాకల్టీ చైర్మన్, హెచ్‌వోడీ, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్, ఎక్స్‌టర్నల్ సభ్యులుగా ఉంటారని మరోసారి, హెచ్‌వోడీ, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్, ఫ్యాకల్టీతో పాటు ఎక్స్‌టర్నల్ ఉంటారని ఇంకోసారి ప్రచారం జరిగింది. అయితే సంబంధిత ప్రిన్సిపాల్, హెచ్‌వోడీలకు తెలియకుండానే కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రిన్సిపాల్ పేరుతోనే నోటిఫికేషన్ విడుదలైనందున.. ఆయన లేకుండా ఎంపిక కమిటీని ఏర్పాటు చేయడం చట్ట ప్రకారం సరైంది కాదని వర్సిటీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

సమన్వయలోపంతోనే..

ఏయూలో వీసీ, అధికారులు సమన్వయంతో పని చేస్తే సమస్యలు పరిష్కారం అవుతాయి. అతిథి అధ్యాపకులందరికీ న్యాయం జరిగేలా నిర్ణయాలు తీసుకోవాలి. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని అతిథి అధ్యాపకుల నియామకం పారదర్శకంగా, ఏయూ నిబంధనల ప్రకారం చేపట్టాలి.

– డాక్టర్ ఎం.సురేష్ మీనన్, అధ్యక్షుడు, ఏయూ అధ్యాపకుల సంఘం

నిబంధనలు అతిక్రమిస్తే సీజ్ చేస్తాం

సరోగసీ, ఐవీఎఫ్ సెంటర్లకు డీఎంహెచ్‌వో హెచ్చరిక



తనిఖీలు నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: సరోగసీ, ఐవీఎఫ్ సెంటర్లు నిబంధనల ప్రకారం మాత్రమే పనిచేయాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి. జగదీశ్వరరావు హెచ్చరించారు. మంగళవారం రేసవానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయ సమావేశ మందిరంలో సరోగసీ, ఐవీఎఫ్ సెంటర్ల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సెంటర్లు అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే సెంటర్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అలాగే అనుమతి లేకుండా ఐవీఎఫ్, సరోగసీ నిర్వహించినా చర్యలు తప్పవని, అనుమానం వచ్చిన వాటికి నోటీసులు జారీ చేస్తామన్నారు. లైసెన్స్ గడువు ముగిసినా సృష్టి సెంటర్ నడిపారని, విశాఖలోని సృష్టి సెంటర్లపై నిఘా పెట్టామని డీఎంహెచ్‌వో తెలిపారు. సమావేశంలో 53 ఐవీఎఫ్, సరోగసీ సెంటర్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఐవీఎఫ్, సరోగసీ సెంటర్లలో తనిఖీలు

నగరంలోని ఐవీఎఫ్, సరోగసీ సెంటర్లను డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తన బృందంతో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జాతీయ రహదారిపై ఉన్న పద్మశ్రీ ఐవీఎఫ్ సెంటర్, పీఎంపాలెంలోని ఓయాసిస్ ఐవీఎఫ్ సెంటర్లను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. ప్రతి ఐవీఎఫ్ సెంటర్‌లో గైనకాలజిస్టులు, ఆండ్రాలజిస్టులు, ఎంబ్రియోలాజిస్టులు నిరంతరం అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ఐవీఎఫ్, సరోగసీ సెంటర్లు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పని చేయాలని, ఎటువంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడవద్దని హెచ్చరించారు. అలాగే సకాలంలో రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేసుకోవాలని స్పష్టం చేశారు. నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఉమావతి నగరంలోని సరోగసీ సెంటర్లు, సహాయక పునరుత్పత్తి సాంకేతిక (ఏఆర్‌టీ) బ్యాంక్ ఎల్1, ఎల్2లను పరిశీలించి.. అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

నిత్యావసర వస్తువుల విక్రయాలపై నిఘా

జేసీ మయూర్ అశోక్



మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: నిత్యావసర వస్తువుల విక్రయ ధరలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనలకు లోబడి మాత్రమే స్టాక్ నిల్వలను ఉంచాలని, పరిమితికి మించి నిల్వ చేయవద్దని ఆయన స్పష్టం చేశారు. కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో మంగళవారం సివిల్ సప్లై, మార్కెటింగ్ అధికారులు, వర్తకులతో బియ్యం, పంచదార, పప్పుదినుసులు, కూరగాయల ధరల నియంత్రణ, అదుపుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఇటీవల కాలంలో బియ్యం, పంచదార, పప్పు దినుసుల ధరలు క్రమంగా పెరుగుతున్నాయని, ఈ పరిణామం ప్రజలపై ఆర్థిక భారం మోపుతోందని పేర్కొన్నారు. ప్రజలకు సరసమైన ధరలకే సరకులు విక్రయించాలని స్పష్టం చేశారు. నగర పరిధిలోని 13 రైతుబజార్లలో బియ్యం, పంచదార, పప్పు దినుసులతో కూడిన ప్రత్యేక కౌంటర్లు కొనసాగించాలని డీఎస్‌వో వి.భాస్కరరావు, మార్కెటింగ్ శాఖ డీడీ శ్రీనివాస్ కిరణ్‌లను ఆదేశించారు. ఈ సందర్భంగా వర్తకులు తమ సమస్యలను జేసీ దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకుంటామని, లాభాపేక్ష లేకుండా విక్రయాలు జరుపుతామని హామీ ఇచ్చారు.

గ్యాస్ డెలివరీ చార్జీలు వసూలు చేస్తే చర్యలు

దీపం పథకం అర్హతలు, నిధుల జమపై ప్రజలకు సవివరంగా చెప్పాలని జేసీ సూచించారు. గ్యాస్ డెలివరీ సమయంలో బాయ్స్ చార్జీలు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, అలా చేయడానికి వీల్లేదని స్పష్టం చేశారు. చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు ఈ వ్యవహారంపై ప్రత్యేక నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే గ్యాస్ ఏజెన్సీలకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. సివిల్ సప్లైస్ డీఎం ఎం.శ్రీలత, ఇతర అధికారులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, వర్తకుల సంఘం ప్రతినిధులు, ట్రేడర్లు, హోల్ సేలర్స్, రిటైలర్లు పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం

దువ్వాడలో ప్రీ పెయిడ్ ఆటో, ట్యాక్సీ స్టాండ్ ప్రారంభం



డీఆర్ఎంకు వినతిపత్రం అందజేస్తున్న రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

అగనంపూడి: ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు ప్రీపెయిడ్ ఆటోస్టాండ్‌ను ఏర్పాటు చేసినట్లు వాల్తేర్ డీఆర్ఎం లలిత్ బొహ్రా, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. దువ్వాడ రైల్వేస్టేషన్ నాలుగో నంబర్ ప్లాట్‌ఫాం వైపు ప్రీ పెయిడ్ ఆటో, ట్యాక్సీ స్టాండ్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దువ్వాడ రైల్వేస్టేషన్ నుంచి నగరంలోని అన్ని ప్రాంతాలకు జీపీఎస్ ట్రాకింగ్ సౌకర్యంతో ఆటో, ట్యాక్సీలు అందుబాటులో ఉంచినట్లు వివరించారు. అలాగే టారిఫ్‌లను ఖరారు చేశామని, ఆ మేరకు మాత్రమే ప్రయాణికులు చెల్లించాలని సూచించారు. డ్రైవర్లు అధిక చార్జీలు డిమాండ్ చేసినా లేదా ప్రయాణంలో ఇబ్బందులు ఎదురైనా రైల్వే అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. సుమారు 70 ఆటోలు ప్రీపెయిడ్ ఆటో స్టాండ్‌లో నమోదయ్యాయని.. వీటన్నింటికీ జీపీఎస్ ట్రాకింగ్ చేస్తామన్నారు. ఈ సందర్భంగా దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రైల్వేస్టేషన్ పరిధిలో కంట్రోల్ పాయింట్ ఏర్పాటు చేయాలని సీపీకి ఓ వినతిపత్రంలో కోరారు. వందే భారత్‌కు దువ్వాడలో హాల్ట్ ఇవ్వాలని, సౌకర్యాలు కల్పించాలని డీఆర్ఎంకు వినతిపత్రం అందించారు. డీసీపీ మేరీ ప్రశాంతి, ఏసీపీ వై.శ్రీనివాసరావు, సీనియర్ డీసీఎం కె.సందీప్, సీనియర్ డీఈఈ ఎం.ఎస్.ఎన్.మూర్తి, డీఈ సాయి అనూప్, తూర్పు కోస్తా రైల్వే జోనల్ కన్సల్టెన్సీ కమిటీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్, దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు జాషువా, మురళీధర్‌రెడ్డి, బి.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

5న సీఎండీ కార్యాలయం వద్ద మహాధర్నా



ఐక్యత చాటుతున్న ప్రజా సంఘాల ప్రతినిధులు

డాబాగార్డెన్స్: ప్రజలపై భారాలు మోపే అదాని విద్యుత్ స్మార్ట్ మీటర్లను వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రజాసంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. కార్మిక, ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ మాట్లాడారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ బోర్డును మూడు ముక్కలుగా చేసి ట్రాన్స్‌కో, జెన్కో, డిస్కం పేరిట విభజించారని, ఇప్పుడు మళ్లీ విద్యుత్ సంస్థలను మొత్తం కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు పూనుకుంటున్నారన్నారు. అందులో భాగంగానే స్మార్ట్ మీటర్లను తీసుకువచ్చారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు పెడితే వాటిని బద్దలు కొట్టండి అన్న లోకేష్, అధికారంలోకి వచ్చాక విద్యుత్ సంస్కరణ పనులను రాష్ట్రంలో శరవేగంగా అమలు చేస్తున్నారన్నారు. ఈ సంస్కరణలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతులను చేసి, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని సూచించారు. విద్యుత్ స్మార్ట్‌మీటర్ల ఉపసంహరణ కోరుతూ ఆగస్టు 5న ఈపీడీసీఎల్ సీఎండీ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు చెప్పారు. ఏఐటీయూసీ జిల్లా నాయకుడు ఎస్‌కే రెహ్మాన్, పీవోడబ్ల్యూ అధ్యక్షురాలు ఎం.లక్ష్మి, ఆర్‌కేఎస్‌వీ కుమార్ తదితరులు మాట్లాడుతూ విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో ప్రజలందరినీ భాగస్వాములు చేయాలని, ప్రజాసంఘాలన్నీ సిద్ధం కావాలని కోరారు. ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించాలని, లేకుంటే 2000 సంవత్సరంలో జరిగిన విద్యుత్ పోరాట స్ఫూర్తితో అలాంటి పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు ఎం.మన్మథరావు, కె.దేవ, తిరుపతిరావు, బేగం, ఎస్.గౌరీ, ప్రకాశరావు, యూఎస్ఎన్ రాజు, ఎల్‌జే నాయుడు, నాయనబాబు తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా.. పెను సమస్య

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

బీచ్‌రోడ్డు: మానవ అక్రమ రవాణా ప్రపంచవ్యాప్తంగా పెను సమస్యగా మారుతోందని, ఇది చాలా విచారకరమని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె. సుభద్ర అన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం, ఏటీఎస్ఏసీ ఇండియా సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ, సీఐడీ, పలు సంస్థల సమన్వయంతో రూపొందించిన 'మానవ అక్రమ రవాణా ఒక వ్యవస్థీకృత నేరం – ఈ దోపిడీని అంతం చేయండి' పోస్టర్‌ను మంగళవారం సిరిపురంలోని జెడ్పీ చైర్మన్ క్యాంప్ ఆఫీసులో ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానంగా అక్రమ రవాణాలో పిల్లలు, మహిళలు, పేదలు, నిరక్షరాస్యులు బాధితులుగా మారుతుండటం బాధాకరమన్నారు. చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ గొండు సీతారాం మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాతో పాటు బాలికల అక్రమ రవాణా వ్యవస్థను రూపుమాపేందుకు తమ ఫోరం రాష్ట్రంలోని 16 ఎన్‌జీవోలతో కలిసి పనిచేస్తోందన్నారు. ఫోరం ప్రతినిధులు కె. ఎల్లయ్య, బి. లవకుశ, ఎం. ప్రవీణా త్రినాథ్, బి. లక్ష్మణరావు, బొడ్డేపల్లి సురేష్, ఎం. హరీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీసీబీ చైర్మన్‌గా జె.వి.సత్యనారాయణమూర్తి





జె.వి.ఎస్ మూర్తి, బ్యాంకు చైర్మన్ రాఘవేంద్రరావు, వైస్ చైర్మన్

సీతంపేట: విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంక్ (వీసీబీ) చైర్మన్‌గా జె.వి.సత్యనారాయణమూర్తి, వైస్ చైర్మన్‌గా చలసాని రాఘవేంద్రరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు సూర్యనేని నాగభూషణ చౌదరి, ఎ.జె. స్టాలిన్, వీరఘంట చంద్రశేఖర్, గుళ్లపల్లి జనార్దనరావు, చెరువు ఆదినారాయణ శాస్త్రి, కండాపు ప్రసాదరావు, ఉప్పలపాటి పార్వతీదేవి, చిన్నం కోటేశ్వరరావు, మరో 11 మంది డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. దేశవ్యాప్తంగా పనిచేస్తున్న 1,472 సహకార అర్బన్ బ్యాంకుల్లో.. విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంక్ దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద అర్బన్ బ్యాంక్‌గా నిలిచింది. ఆర్థిక కార్యకలాపాల రీత్యా దేశంలోనే మొదటి 10–15 స్థానాల్లో ఈ బ్యాంక్ ఉంది. రాష్ట్ర విభజన అనంతరం హైదరాబాద్‌లో కూడా శాఖలను కలిగి ఉండటంతో పాటు ఇది బహుళ రాష్ట్రాల సహకార సంఘంగా అభివృద్ధి చెందింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపి 1.12 లక్షల మంది షేర్ హోల్డర్లు, రూ. 400 కోట్ల షేరు ధనం కలిగి ఉన్న ఈ బ్యాంకులో.. ఎటువంటి వివాదాలకు అవకాశం లేకుండా మూడు దశాబ్దాలుగా పాలకవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా జరుగుతుండడం విశేషం.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



మాట్లాడుతున్న కెనరా బ్యాంక్ విజయవాడ సర్కిల్ జీఎం విజయలక్ష్మి

తగరపువలస: ఆనందపురం మండలం చందకలో కెనరా బ్యాంక్ స్థానిక బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం 'సురక్షజ్యోతి' నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ విజయవాడ సర్కిల్ జనరల్ మేనేజర్ సీజే విజయలక్ష్మి.. సామాజిక భద్రతా పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు సైబర్ మోసాలలో సున్నితత్వం, ఈ కేవైసీ ప్రాముఖ్యత, ఖాతాలలో నామినేషన్ వివరాలు నవీకరించడం గురించి తెలియజేశారు. దేశంలోనే రెండో అతి పెద్ద ప్రభుత్వ యాజమాన్య సంస్థల్లో ఉన్న కెనరా బ్యాంకు పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై, ఏపీవై వంటి సామాజిక భద్రతా పథకాలను విస్తృతంగా అమలు చేస్తోందన్నారు. విశాఖ రీజనల్ హెడ్, ఏజీఎం ఎన్.మధుసూదనరెడ్డి మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యతకు ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. డివిజనల్ మేనేజర్ హెచ్.ప్రతాప్‌కుమార్, బంక సత్యం, సర్పంచ్ బంక శ్రీను, మాజీ సర్పంచ్ జీవీ రమణ, ఎంపీటీసీ సభ్యుడు ఎం.నాగేశ్వరరావు, రాజు, సోమినాయుడు, బ్యాంకు సిబ్బంది, వందల సంఖ్యలో పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.

ఏపీ బాక్సింగ్ సంఘం నూతన కార్యవర్గం

విశాఖ స్పోర్ట్స్: ఏపీ బాక్సింగ్ సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటైంది. స్థానికంగా ఆదివారం ఎంపిక ప్రక్రియ జరగ్గా.. మంగళవారం వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో కార్యవర్గ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తనను సంఘ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారని తెలిపారు. పి.మధుసూదనరావు కార్యదర్శిగా, కె.శ్రీనివాసరావు కోశాధికారిగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. అలాగే నలుగురిని ఉపాధ్యక్షులుగా, ఆరుగురిని సంయుక్త కార్యదర్శులుగా, నలుగురిని సభ్యులుగా ఎంపిక చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు.

ఉద్యోగాల కల్పనే లక్ష్యం

జేసీ మయూర్ అశోక్



మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

బీచ్ రోడ్డు: రాష్ట్రంలో రాబోయే రోజుల్లో 20 వేల స్టార్టప్‌లను స్థాపించి, వాటి ద్వారా లక్ష ఉద్యోగాలను సృష్టించడమే ప్రభుత్వ లక్ష్యమని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అన్నారు. ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి మనమందరం కలిసి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో మంగళవారం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమ ప్రారంభోత్సవంలో జేసీ మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతిభావంతులైన జీఎస్‌డబ్ల్యూఎస్ సిబ్బందిని ఒకే వేదికపైకి తీసుకువచ్చి.. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం విశేషమన్నారు. 'ఇది కేవలం శిక్షణ కార్యక్రమం మాత్రమే కాదు, మీలో ప్రతి ఒక్కరిలో ఉన్న అద్భుతమైన సామర్థ్యాలను వెలికి తీయడానికి ఇది ఒక చక్కని అవకాశం' అని అన్నారు. శిక్షణ పొందిన సిబ్బంది ద్వారా రాష్ట్రవ్యాప్తంగా స్టార్టప్‌లపై ఆసక్తి ఉన్న వారికి శిక్షణ ఇవ్వనున్నారని జేసీ వెల్లడించారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సీఈవో సూర్య తేజ తదితరులు పాల్గొన్నారు.

మంగళకారిణి.. సౌభాగ్యప్రదాయిని



గాజుల అలంకరణలో రాస పోలమాంబ

తగరపువలస: మజ్జివలస గ్రామదేవత రాసపోలమాంబ మంగళవారం గాజుల అలంకరణలో సౌభాగ్య ప్రదాయినిగా దర్శనమిచ్చారు. శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేటకు చెందిన కర్రి ఆదినారాయణ, ఆదిలక్ష్మి దంపతులు సహకారం అందించారు.

లులూకు భూకేటాయింపులు రద్దు చేయాలి

డాబాగార్డెన్స్: కూటమి ప్రభుత్వం లులూకు కేటాయించిన భూములను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. ఆర్కే బీచ్ రోడ్డులో ఉన్న సుమారు రూ.వెయ్యి కోట్ల విలువైన 13.74 ఎకరాల భూమిని కారు చౌకగా విదేశీ సంస్థ లులూ మాల్ నిర్మాణానికి గాను ధారాదత్తం చేయడాన్ని సీపీఎం జిల్లా కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ప్రజల ప్రయోజనాలకు తీవ్ర భంగం కలిగించే ఈ దుర్మార్గ జీవోను రద్దు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని సీపీఎం డిమాండ్ చేస్తుందన్నారు. ఈ భూ కేటాయింపు రద్దయ్యే వరకు పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, పౌర సంఘాలు, కాలనీ రెసిడెన్షియల్ అసోసియేషన్లు రాష్ట్ర ప్రభుత్వ భూదందాను వ్యతిరేకించాలని, అలాగే లులూ మాల్ భూకేటాయింపులకు వ్యతిరేకంగా నిర్వహించే ప్రజా ఉద్యమంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఏకంగా 99 ఏళ్ల పాటు ఇవ్వడం ప్రజా భూమిని అప్పనంగా లులూ సంస్థకు కేటాయించడమేనని, ఈ భూమి కోస్టల్ రెగ్యులేటరీ జోన్ పరిధిలోకి వస్తుందన్నారు. లులూ భూ కేటాయింపు వెనుక కోట్ల రూపాయల అవినీతి జరిగిందనే అనుమానాలు ఉన్నాయన్నారు. లులూ మాల్ వల్ల విశాఖ ప్రజలకు ఏమాత్రం ప్రయోజనం ఉండదన్నారు. లూలూకి ధారాదత్తం చేసే అధికారం చంద్రబాబు ప్రభుత్వానికి లేదని తెలిపారు.

పైడితల్లి అమ్మవారి పూజారి లండ మృతి



లండ వెంకటరమణ

సింహాచలం: రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి పూజారి, 98వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు, అడవివరం కోఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ లండ వెంకటరమణ(45) మంగళవారం మృతిచెందారు. ఆయన.. భార్య దేవితో కలిసి ఈ నెల 27న సింహాచలం నుంచి ఆనందపురం మండలం గిడిజాలలో జరిగే ఓ పుట్టినరోజు ఫంక్షన్‌కు ద్విచక్రవాహనంపై బయల్దేరారు. గుడిలోవ సమీపంలో వీరి బైక్‌ను కారు ఢీకొనడంతో వెంకటరమణ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే నగరంలోని ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. ఆయన కొడుకు నితిన్ ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరం, కుమార్తె ప్రజ్ఞ 9వ తరగతి చదువుతున్నారు. ఆది నుంచి లండ వెంకటవమణ దివంగత మహానేత వైఎస్సార్, ఆ తర్వాత మాజీ సీఎం వైఎస్ జగన్‌కు పెద్ద అభిమానిగా ఉన్నారు. కొడుకు నితిన్‌కు చిన్నప్పుడు గుండె సమస్య రావడంతో ఆరోగ్యశ్రీలో చికిత్స జరిగింది. ఆయన మృతదేహానికి అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, 98వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, 98వ వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం నివాళులర్పించారు. బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.